క్లుప్తంగా

'కొమ్మూరి'ని కలిసిన ఏసీపీ



జనగామ: జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఏసీపీ దామోదర్‌రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. అనంతరం శాంతి భద్రలపై చర్చించారు.

కేసు నమోదు

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్ శివారులో దళితుడి వ్యవసాయ భూమిలోని కనీలు ధ్వంసం చేసి కులం పేరుతో దూషించిన నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై చాగర్ల రఘుపతి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోమల్ల గ్రామానికి చెందిన మేకల నరేందర్ ఏడాది క్రితం ఖిలాషాపూర్ శివారులో గ్రామానికి చెందిన గాదె మల్లికాంబకు చెందిన 2.20 ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. ఈ నెల 18న దాని చుట్టూరా కనీలు నాటేందుకు సర్వేయర్‌తో వెళ్లగా తమ పక్కన ఉన్న భూమి ఎలా కొనుగోలు చేస్తావని నరేందర్‌ను కులం పేరుతో దూషిస్తూ 20 కనీలను ధ్వంసం చేసి రాళ్లతో దాడికి యత్నించారు. బాధితుడు నరేందర్ ఫిర్యాదు మేరకు జిట్ట కొమురయ్య, జిట్ట శోభ, జిట్ట రాజు, కంబాల సాంబరాజులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

జఫర్‌గఢ్: ఇంటి ముందు ఒంటరిగా ఉన్న మహిళ మెడలోంచి ఓ దొంగ బంగారు గొలుసును అపహరించిన సంఘటన మండలంలోని రఘునాథ్‌పల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొమ్మినేని వినోద మధ్యాహ్నం తన ఇంటి ఎదుట కూర్చుంది. ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఊరుపేరు అడిగి మెడలోని గోపితాడును లాక్కొని పరారయ్యాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


నాగరాజు (ఫైల్)

చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాల ఎల్లమ్మ గుడి ఎదురుగా మంగళవారం తెల్లవారు జామున కారు అదుపుతప్పి బోల్తా పడడంతో వరికుప్పల నాగరాజు (34) అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై వినయ్‌కుమార్, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన శివసత్తి నాగరాజు దేవుడు చెబుతుంటాడు. సోమవారం డ్రైవర్ చుక్క హరీష్‌తో కలిసి తన కారులో ఐనవోలుకు వెళ్లారు. అక్కడ పనులు ముగిశాక రాజవరం గ్రామానికి బయలు దేరారు. మంగళవారం తెల్లవారుజాము చిన్నపెండ్యాల ఎల్లమ్మ గుడి సమీపంలో కారు అదుపుతప్పి ఎగిరి కాల్వ కల్వర్టును ఢీకొని పొలాల్లో పడింది. దీంతో నాగరాజు అక్కడిక్కడే మృతి చెందగా హరీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పెట్రోలింగ్ కానిస్టేబుల్ వీరన్న ఘటన స్థలానికి వెళ్లి గాయపడ్డ వీరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు. అతి వేగమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చన్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నక్కల దాడి.. దూడల మృతి

చిల్పూరు : పాకలో కట్టేసిన 5 దూడలు తెల్లవారే సరికి మృతి చెందాయి. వాటిని హతమార్చింది నక్కలేనని అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. వివరాలిలా.. మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన పాడి రైతులు చింతల రవి, నాగారపు గట్టయ్య, బానోత్ బాలు, ఎడవెల్లి నర్సింహారెడ్డి, కీసర యాదవరెడ్డిల వ్యవసాయ భూములు గ్రామానికి దూరంగా ఉంటాయి. ఈ క్రమంలో ఎప్పటిలాగే సదరు రైతులు రవి, గట్టయ్య, బాలు, నర్సింహారెడ్డి, యాదవరెడ్డి సోమవారం రాత్రి దూడల పాలు పితికి కట్టేసి ఇళ్లకు వెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున వచ్చే సరికి 5 దూడలు చనిపోయి ఉన్నాయి. మూడ్రోజుల క్రితమే ఇద్దరు రైతులకు చెందిన దూడలు ఇదే తరహాలో మృతి చెందిన క్రమంలో బాధిత రైతులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ జరీనా, మండల పశు వైద్యాధికారి మూడిక అనేష్ ఘటనా స్థలికి చేరుకుని మృతి చెందిన దూడలను, వాటిని చంపిన జంతువు కాలి గుర్తులను పరిశీలించారు. కాలిగుర్తులను గుర్తించడంలో కొంత అస్పష్టత ఉండడంతో జిల్లా కేంద్రంలో నిపుణులతో గుర్తింపజేశారు. సదరు గుర్తులు నక్కల కాలివిగా గుర్తించారు. ఈ సందర్భంగా సెక్షన్ ఆఫీసర్ జరీనా మాట్లాడారు. గ్రామానికి దూరంగా ఉన్న వ్యవసాయ పొలాల వద్ద ఉండే పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అడవుల్లో ఉండాల్సిన పెద్ద నక్కలు గ్రామాలకు వచ్చినట్లుగా తెలుస్తోందని చెప్పారు. రైతులు దూడలను సురక్షితమైన కొట్టాల్లో కట్టేయాలని స్పష్టం చేశారు.

జాతరకు సర్వం సిద్ధం


నర్మెట: అమ్మాపురంలో సమ్మక్క-సారలమ్మ గద్దెలు


స్టేషన్‌ఘన్‌పూర్: జాతర ప్రాంగణంలో సీఐ, వైస్ ఎంపీపీ, చైర్మన్

నర్మెట: మండలంలోని అమ్మాపురంలో సమ్మక్క-సారలమ్మ మినీ మేడారం జాతరకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లను సిద్ధం చేసింది. గద్దెలను సర్వాంగ సుందరంగా అలంకరించడంతో పాటు తాగు నీటి, మరుగుదొడ్లతో పాటు సౌకర్యాలు కల్పించారు. గత 10 సంవత్సరాలుగా జాతర నిర్వహిస్తుండగా కరోనా కారణంగా ఒక ఏడాది జాతర నిలిచిపోయింది. మేడారం జాతర నిబంధనలకు అనుగుణంగా జాతర నిర్వహిస్తున్న కమిటీ ఇతర మండలాల నుంచి సైతం భక్తులు చేరుకోనుండటంతో అన్ని సౌకర్యాలు కల్పించారు. మూడు రోజుల జాతరలో సారలమ్మ, పగిడిద్దరాజు(బుధవారం), సమ్మక్క (గురువారం) గద్దెలను చేరుకుంటుండగా శుక్రవారం భక్తులు మొక్కులను చెల్లించుకుంటారు. ఏర్పాట్లలో మాజీ సర్పంచ్ కుంటి జగన్‌మోహన్, ఎంపీటీసి లింగాల లక్ష్మి సిద్దయ్య, బర్రె భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బైరగోని సురేందర్, మాజీ ఉప సర్పంచ్ బైరగోని లక్ష్మయ్య, కుంటి రమేష్, బోగా అంజయ్య, గంగం సుధాకర్‌రెడ్డి, పడ్ల బాలనర్సు, బైరగోని రాజు, పిట్టల కనకయ్య, మెరుగుల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు

మన్‌సాన్‌పల్లిలో పోచమ్మతల్లి బోనాలు

బచ్చన్నపేట: మండలంలోని మన్‌సాన్‌పల్లిలో గ్రామస్తులు పోచమ్మతల్లికి మంగళవారం బోనాలను చేశారు. గ్రామంలో సమ్మక్క-సారలమ్మల జాతర సందర్భంగా ముందుగా పోచమ్మ బోనాలను చేసి చెల్లించారు. జాతరకు చుట్టు పక్కల గ్రామాలు సాల్వాపూర్, వట్టిపల్లి, పడమటికేశ్వాపూర్, లింగంపల్లి, జాల, సింగారం, పలు గ్రామాల నుంచి భక్తులు వస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

తాటికొండ జాతర పనుల పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ, జిట్టెగూడెం గ్రామాల పరిధిలోని సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణంలో జరుగుతున్న పనులను సీఐ ముస్క రాజు, ఎస్సై నాగరాజు, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాతర కమిటీ చైర్మన్‌తో మాట్లాడి జరుగుతున్న పనులు, చేస్తున్న ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ నేటి నుంచి ఈనెల 24 వరకు సమ్మక్క-సారలమ్మ జాతర ఉంటుందన్నారు. జాతర వద్ద విద్యుత్, తాగునీటి, లైటింగ్, చలువపందిళ్లు తదితర అన్ని పనులు చేపట్టారన్నారు. భక్తుల కోసం అన్ని సౌకర్యాలు చేశారని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై వనదేవతల ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. అనంతరం సీఐని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ కోరుకొప్పుల మహేందర్, మార్క శ్రీను, మారపాక రాములు, బొంగోని యాదగిరి, ఐలోని కిరణ్, బలిజ రాజు, దామర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభినందనీయం

చిల్పూరు: శ్రీపతిపల్లి-కొండాపూర్ సమ్మక్క-సారలమ్మ మినీ మేడారం జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు శ్రీపతిపల్లికి చెందిన ఫార్మర్ ప్రొడక్షన్ ఆర్గనైజేషన్ ఫౌండర్ మాలోత్ రాజు-శ్రవంతి దంపతులు ముందుకు రావడం అభినందనీయమని చైర్మన్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, వైస్ చైర్మన్ పుట్ట రాజు అన్నారు. రూ. లక్ష సొంత ఖర్చులతో దాత చేయించిన పనులను మంగళవారం వారు పరిశీలించారు. కార్యక్రమంలో దాతలు మాలోత్ జ్ఞానేశ్వర్, పూజిత, రంగు హరీష్, గొంగిడి కృష్ణమూర్తి, గడ్డం సిద్దయ్య, బాలకృష్ణ, రంగు రమేష్, కొయ్యడ రాందాసు, గాలి రాజు తదితరులు ఉన్నారు.


తరిగొప్పుల: ఎత్తు బంగారం కొనుగోలు చేస్తున్న భక్తులు


బచ్చన్నపేట: బోనాలతో మహిళలు

ఎత్తు బంగారం మొక్కులు

తరిగొప్పుల: సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాలు పురస్కరించుకొని వన దేవతలకు మొక్కులు చెల్లించేందుకు భక్తులు ఎత్తు బంగారం కొనుగోలు చేస్తున్నారు. దీంతో మంగళవారం మండలకేంద్రంలో ఎత్తు బంగారం(బెల్లం) షాపుల వద్ద సందడి నెలకొంది.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



బచ్చన్నపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విదాయర్థులు కరాటే పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ గీత తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఓపెన్ కరాటే, త్రైకాండో ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. పాఠశాలకు చెందిన కె.వర్షిని(9వ తరగతి), జి.సందీప్తి (9వ తరగతి), జశ్వంతి (6వ తరగతి)లతో పాటు సంజన, నవ్యశ్రీ, జనాని 8 పతకాలను, అలాగే భార్గవి, అనుశ్రీ, స్వాతికలతో పాటు మరో ఐదుగురు కాంస్య పతకాలతోపాటు మెమోంటోను సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గ్యాస్ ఆథారిటీ ఆఫ్ ఇండియా, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్వో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ మంజుల అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ ప్రతినిధి గాదె గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. కౌన్సిలర్ హరిశ్చంద్ర గుప్త, రంగమ్మ, అనురాధ, సంతోషి, సునీత, మీన పాల్గొన్నారు.

వడ్డెర కాలనీకి దారిపై ఎమ్మెల్యే సమీక్ష


మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ: జిల్లా కేంద్రం సిద్దిపేట రోడ్డు మెడికల్ కళాశాల సమీపంలో ఉన్న వడ్డెర కాలనీకి దారి కోసం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మెడికల్ కళాశాల నిర్మాణంతో కాలనీకి దారి లేకుండా పోతుందని అక్కడి ప్రజలు ఎమ్మెల్యేతో మొరపెట్టుకోగా, ఆయన వెంటనే స్పందించారు. ఆర్‌అండ్‌బీ ఈఈ హుస్సేన్, ఇతర ఇంజినీర్లతో కలిసి వడ్డెర కాలనీని సందర్శించారు. మెడికల్ కళాశాల నిర్మాణం, కాలనీ దారికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. వడ్డెరకాలనీ ప్రజల రాకపోకలకు 20 ఫీట్ల దారి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజల అవసరాల నిమిత్తం అవసరమైతే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని, రోడ్డు కోసం మ్యాప్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్డు వదిలి పెట్టని సమయంలో కాలనీ ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

బీఆర్‌ఎస్ హయాంలో షెడ్యూల్డ్ తెగలకు ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ఆధ్వర్యాన లంబాడా తండాలు, గిరిజన గూడెంలు అభివృద్ధి చెందాయని, బీఆర్‌ఎస్ పాలనలో షెడ్యూల్డ్ తెగలకు ప్రాధాన్యం లభించిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్ జయంతి వేడుకలను డివిజన్ కేంద్రంలోని కేఆర్ గార్డెన్స్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. విద్య ద్వారా ఏదైనా సాధించవచ్చని, గిరిజన పిల్లలకు ఐక్యూ ఎక్కువగా ఉంటుందని, ఎన్ని కష్టాలు ఉన్నా వారిని తప్పకుండా చదివించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసం రామ్మూర్తి, చిల్పూరు వైస్ ఎంపీపీ సరిత, ఎంపీటీసీలు బూర్ల లతాశంకర్, గుర్రం రాజు, గన్ను నర్సింహులు, మునిగెల రాజు, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బానోతు వసంత్‌నాయక్, ఎస్టీ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం దరావత్ రాజు, సేవాలాల్ కమిటీ బాధ్యులు లకావత్ చిరంజీవి, బి.రాజేష్‌నాయక్, రమేష్‌నాయక్, హుస్సేన్, దర్గానాయక్, శ్రీనివాస్, స్వామినాయక్, రవీందర్ వివిధ మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

బంజారాలు ఐక్యంగా ఉండాలి

జనగామ రూరల్: బంజారాలు సేవాలాల్ మహరాజ్ ఆశీస్సులతో ఐక్యంగా ఉండాలని ఎర్రకుంట మాజీ సర్పంచ్ మంజుల అన్నారు. మంగళవారం సేవాలాల్ జయంతిని గ్రామంలో ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షురాలు బొల్లం శారద, నర్సింహ, రామన్న, శంకర్, హరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఖేలో ఇండియా సెంటర్ షురూ

పాలకుర్తి: మండలంలోని చెన్నూరు గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ ఆవరణలో జిల్లా స్థాయి ఖేలో ఇండియా సెంటర్‌ను కోచ్ ఓరుగంటి సురేష్ ప్రారంభించారు. మంగళవారం చైర్మన్, రాష్ట్ర క్రీడా ప్రాధికారిత సంస్థ హైదరాబాద్ అనుమతి మేరకు జిల్లా స్థాయి సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని కోచ్ సురేష్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ అకాడమీలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7661095550 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మేరియా జాత్యత, ఎస్ఐ లింగారెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం

రఘునాథపల్లి: ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సురక్షితమని జనగామ ఆర్టీసీ డీఎం జ్యోత్స్న అన్నారు. మంగళవారం రఘునాథపల్లి బస్టాండ్ నుంచి మేడారం బస్సులను జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు బొల్లం అజయ్, ఎంపీపీ మేకల వరలక్ష్మి, మాజీ సర్పంచ్ పోకల శివకుమార్‌లతో కలిసి ప్రత్యేక బస్సులను ప్రారంభించారు.

గణిత టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ


బహుమతులు అందుకున్న విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఎస్ఆర్ఎఫ్ (శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్) ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన గణిత శాస్త్ర టాలెంట్ టెస్ట్‌లో స్థానిక ఒయాసిస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటారు. ఈ మేరకు ఒయాసిస్ స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గణితశాస్త్ర టాలెంట్ టెస్టులో తమ పాఠశాల నుంచి కె.శివ(7వ తరగతి) రాష్ట్రస్థాయి, కె.చరణ్, డి.అభినయ, సీహెచ్.మహన్య, జి.శన్విక, కె.హర్షిత జిల్లాస్థాయిలో ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సతీష్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు కమలాకర్, భానుప్రకాష్, రవీందర్, కీర్తిప్రసాద్, శ్రీలత, ప్రవంతి తదితరులు అభినందించారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి


వేడుకల్లో దాతలు

జఫర్‌గఢ్: ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని దాతలు ముచ్చ శ్యాంసుందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, చేగొండ నరహరి, పల్లె రాజిరెడ్డి అన్నారు. మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు ఎండీ పర్వేజ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిలుగా వారు హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో చదువు ద్వారానే అన్ని సాధించవచ్చన్నారు. పాఠశాలను మరింత అభివృద్ధి చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. అనంతరం పాఠశాల విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, దాతలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జనగామ అభివృద్ధే ధ్యేయం

- డీసీసీ అధ్యక్షుడు, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి


మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: జనగామ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ సుందరీకరణతో పాటు 8 మండలాల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.25 కోట్ల నిధులను మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. సీసీరోడ్లు, ఇతర అవసరాలకు సంబంధించి ఎక్కడ ఏ పనులు చేయాలనే విషయమై గుర్తించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో తాగు, సాగు నీటికీ ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు, కౌన్సిలర్లు సర్వల నర్సింగరావు, బడికే ఇందిర, బనుక శివరాజ్ యాదవ్, గాదెపాక రామచంద్రం, వంగాల కల్యాణి, మేడ శ్రీనివాస్, ఆలేటి సిద్దిరాములు, నర్సింహారెడ్డి, నర్సిరెడ్డి, కరుణాకర్ రెడ్డి, జమాల్ షరీఫ్, మల్లేశం, దుర్గేష్, అండాలు, మున్నీ బేగం, సంజీవరెడ్డి, ప్రవీణ్, మిద్దెపాక స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక షష్టిపూర్తి


షష్టిపూర్తి మహోత్సవంలో జంటలు

జనగామ: పట్టణంలోని హైదరాబాద్‌రోడ్డు సాయిరాం ఫంక్షన్ హాల్‌లో ఎస్ఎన్ కేఎస్ఎన్ వైశ్య మిత్రుల ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక షష్టిపూర్తి, తులాభార మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలతో పాటు హోమాలు నిర్వహించారు. పూర్ణాహుతి పూర్తయిన తర్వాత 60 మంది దంపతులకు సామూహిక షష్టి పూర్తి, తులాభారం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వంగపల్లి చంద్రశేఖర్, ఓరుగంటి నటరాజ్, ఓరుగంటి కేదారినాథ్, గట్టు శ్రీనివాస్, బెలిదె నాగరాజు తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

బచ్చన్నపేట: ప్రభుత్వం అందించే సహకారంతో ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఓ మొగులప్ప అన్నారు. మండల కేంద్రంలోని రచనా మండలి సమాఖ్య భవనంలో ప్రధాన మంత్రి ఫుడ్ మైక్రో ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) లబ్ధిదారులకు మూడు రోజుల శిక్షణలో భాగంగా మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. పీఎంఎఫ్ఎంఈ ఆధ్వర్యంలో రుణాలు తీసుకున్న వారు స్వయం సమృద్ధితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం అనిల్‌కుమార్, ఏపీఎం కొత్తపల్లి నాగేశ్వర్‌రావు, మాస్టర్ ట్రైనర్ అజయ్, సీసీ సందుల నర్సింహులు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కళాశాలను ఆదర్శంగా నిలపాలి

కొడకండ్ల: కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి కొడకండ్ల ప్రభుత్వ కళాశాలను ఆదర్శంగా నిలుపాలని రిటైర్డ్ లెక్చరర్ బాబురావు, జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఫేర్‌వెల్ డేలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు ఐదు రోజులు సెలవు

జనగామ: మేడారం జాతరను పురస్కరించుకుని అడ్తిదారుల కోరిక మేరకు జనగామ వ్యవసాయ మార్కెట్‌కు నేటి(బుధవారం) నుంచి 25వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సెలవులు ప్రకటించడం జరిగిందని మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి భాస్కర్ మంగవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మరుగుదొడ్లకు బిల్లులు మంజూరు

చిల్పూరు: మంజూరైన వ్యక్తిగత మరుగుదొడ్లను పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే బిల్లుల మంజూరు చేస్తామని జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని గార్లగడ్డతండా, కృష్ణాజీగూడెం, పల్లగుట్ట, ఫత్తేపూర్, మల్కాపూర్, చిల్పూరు గ్రామాల్లో మంగళవారం మంజూరైన మరుగుదొడ్లను పరిశీలించారు.

ఖర్గేను కలిసిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: కర్ణాటక రాష్ట్రం బీదర్‌లో స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మంగళవారం ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

జనగామ: పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో డంపింగ్ చేసిన పీడీఎస్ బియాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు ఎస్సై సృజన్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ కుమారస్వామి, కానిస్టేబుళ్లు మల్లేష్, శ్రీనివాస్ జనగామ మండలం వెంకిర్యాలకు చెందిన జి.రమేష్ 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం డంప్ చేస్తుండగా పట్టుకున్నారు. కేసు నమోదు చేసుకుని, పట్టుకున్న బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు.

సంక్షిప్త సమాచారం

గీతకార్మికుడికి గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: నమిలిగొండ గ్రామంలో తాటిచెట్టు పైనుంచి పడి మినుముల ఎల్లగౌడ్ తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. ఎల్లగౌడ్ రోజు మాదిరిగానే కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో తలకు, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి గీత కార్మికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

కొడకండ్ల: వేసవి సీజన్‌లో కూలీలు జాయతీయ ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని అడిషనల్ డీఆర్‌డీఓ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం గిర్నితండాలో నిర్వహిస్తున్న ఫీడర్ చానల్ వర్క్ సైటును ఆయన సందర్శించి కూలీల హాజరు మస్టర్‌ను పరిశీలించారు.

యూ టర్న్ ఏర్పాటుకు కేంద్ర మంత్రికి వినతి

రఘునాథపల్లి: యాదాద్రి నుంచి భూపాలపల్లి వరకు నిర్మించిన బైపాస్ రోడ్డులో రఘునాథపల్లి మండల కేంద్రంలోని ఖిలాషాపూర్ క్రాస్ రోడ్డు వద్ద యూ టర్న్ ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వల్లాల వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరిని కలిసి కోరారు.

బీసీ కులగణన తీర్మానం హర్షణీయం

బచ్చన్నపేట: అసెంబ్లీలో బీసీ కులగణన కోసం తీర్మానం చేయడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కోడూరి మహాత్మాచారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. దిడ్డిగ రమేష్, వెంకటేశం, బుచ్చిరాజు, శ్రీనివాస్ ఉన్నారు.

అందుబాటులో అంబులెన్స్ సేవలు

తరిగొప్పుల: మండలకేంద్రంలో మేరి లూయిస్ స్లేటర్ మెమోరియల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా అంబులెన్స్ సేవలు ప్రారంభించినట్లు ఆస్పత్రి నిర్వాహకులు ఫాదర్ డాక్టర్ కేఎం జాన్ మంగళవారం తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత

జఫర్‌గఢ్: తమ్మడపల్లి(జి) గ్రామానికి చెందిన అమంచ మురళి హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్సకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి హనుమకొండలోని తన నివాసంలో రూ.లక్ష 50 వేల ఎల్‌ఓసీని బాధిత కుటుంబానికి మంగళవారం అందజేశారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

బచ్చన్నపేట: జనగామ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బోగస్ ఓట్లతో గెలుపొందారని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు వడ్డెపల్లి ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

ఎన్నిక

బచ్చన్నపేట: భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడిగా బొడ్డు బాబును ఎన్నుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆ సంఘం మండల అధ్యక్షుడురాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మగళ్ల కృష్ణ పాల్గొని మాట్లాడారు.